సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



శున'కాలు' పట్టేస్తున్నాయ్..!

బి.కొత్తకోటలో గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రతి రోజూ కనిపించిన వారి నల్లా కరచి ఆస్పత్రి పాలు చేస్తున్నాయి.

-8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

రామాపురం మండలం గువ్వలచెరువు తూర్పు భాగంలోని కొత్తిమడుగు అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు గురువారం 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ముగిసిన పవిత్రోత్సవాలు



పవిత్రమాలలతో స్వామి, అమ్మవార్లు

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. గురువారం పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, తీర్థప్రసాద గోష్టి, పవిత్రాల వితరణ తదితర వైదిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.భక్తులు దర్శించుకుని తరించారు. సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని, జిల్లాలో చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, హాజరయ్యారు. ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పనులకు ఉపయోగకరంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కృత్రిమ మేధస్సు జెన్ చాట్ బాట్ ప్రాజెక్టుకు సహకరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీపీఓను ఆదేశించారు.



నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఈ బోధకులు పథ నిర్దేశకులు

ఇహపరాలలో జ్ఞానమే శాశ్వతమని నిరూపించేవాడు గురువు. మట్టి అనే అజ్ఞానం నుంచి జ్ఞానవంతులనే మాణిక్యాలను వెలికితీసే జ్ఞాన మేరువు. శిష్యుడి ఎదుగుదలను తనివి తీరా ఆస్వాదించే నిస్వార్థ జీవి.గురువంటే దార్శనికుడు. పథ నిర్దేశకుడు. సమాజానికి సన్మార్గాన్ని చూపి జాతిని ఉద్ధరించే ప్రాతఃస్మరణీయుడు. ఆచార్యుని స్థానం శిఖరాయమానం. విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసే గురువులను గౌరవించడం అందరి బాధ్యత. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి భరతమాతకు ముద్దుబిడ్డలను అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున గురుపూజోత్సవం జరుపుకోవడం జాతికి గర్వకారణం. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పిల్లల ఉన్నతికి పాటుపడిన కొందరు గురువులపై ప్రత్యేక కథనం. –మదనపల్లె సిటీ

వీరి బోధన ప్రత్యేకం



ప్రత్యేక అవసరాల పిల్లలకు పాఠాలు చెబుతున్న నాగేంద్ర

ఆకలి అవుతుందని చెప్పలేరు.. ప్రతిదీ ఎవరైనా పట్టించుకోవాల్సిందే. అలాంటి ప్రత్యేక అవసరాల పిల్లల కోసం తన వంతు కృషి చేస్తున్నారు మదనపల్లె భవిత కేంద్రంలో పని చేసే ఐఈఆర్‌టీ టీచర్ అమినేని నాగేంద్ర. స్పెషల్ బీఈడీ చేసి 1998లో ఐఈఆర్‌టీ టీచర్‌గా చేరారు. 28 సంవత్సరాలుగా దివ్యాంగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. 2016లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

గణిత భయాన్ని పోగొట్టేలా..!



చంద్రశేఖర్

విద్యార్థుల్లో గణితం అంటే ఏదో తెలియని భయం ఉంటుంది. దానిని తొలగించి ఆసక్తి పెంచడమే లక్ష్యంగా అడుగేశారు. అందుకు పాఠశాల గదిని గణిత గార్డెన్‌గా మార్చేశారు. ఆయనే నామా చంద్రశేఖర్. వాల్మీకిపురం మండలం చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.పాలిజియో బోర్డు, అనలిటికల్ జా మెట్రీ బోర్డు, నంబర్ బోర్డులను స్వతహాగా తయారు చేశారు. బోర్డుల ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ఏపీ మాథ్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతి నెలా నిర్వహించే ఉచిత కంటి శిబిరానికి వచ్చే రోగులకు ఉచితంగా భోజనం పెడుతున్నారు.

- 2016లో సౌత్ ఇండియా స్థాయిలో బెంగళూరులో జరిగిన మాథ్స్‌ఫోరంలో జియో పాలీబోర్డుపై ప్రథమ బహుమతి, 2023లో కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మొదటి స్థానం ,2019, 24లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

ఆనందం పంచుతూ... ఆహ్లాదం పెంచుతూ...!



భాస్కరన్

విద్యార్థులకు పాఠాలను బోధించడంతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపుతున్నారు నిమ్మనపల్లె మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు భాస్కరన్. చిన్నతనం నుంచే మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. గతంలో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేశారు. విద్యార్థులు ఇన్‌స్పైర్, కౌశల్ యోజన వంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలలో గతంలో 36 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 90 మంది ఉన్నారు.

- 2020లో గ్రీన్ స్కూల్ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్ అవార్డును గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.జిల్లా స్థాయిలో 2022,2024లో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు అందుకున్నారు.

నరేష్.. క్రీడాకారులకు స్ఫూర్తి



పీడీ నరేష్

మారుమూల గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారిని క్రీడల్లో కుసుమాలుగా తయారు చేస్తున్నారు మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ నరేష్. 2010లో ఫిజికల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడపట్ల ఆసక్తి పెంచేలా చేశారు. పాఠశాలలో ప్రత్యేకంగా క్రీడామైదానం ఏర్పాటు చేయించారు. విద్యార్థులను ఉదయం,సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్,అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి ఏడాది వేసవిలో ఉచిత వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎంపికయ్యారు. 2023–24, 2024–25 సంవత్సరాలకు సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల బెస్ట్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. 2017లో ఉత్తమ జిల్లా అవార్డు, 2023 హిందూ ఉపాధ్యాయ సంఘంచే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

బొమ్మలతో బోధన



పాఠాలు చెబుతున్న రమాభార్గవి

బడిని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతూ రమాభార్గవి ప్రత్యేక గుర్తింపు పొందారు. మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం జంగాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. గత ఏడాది పాఠశాలలో 8 మంది విద్యార్థులు ఉండగా ఆమె ప్రత్యేక దృష్టి సారించి విలేజ్‌గ్రూప్ క్రియేట్ చేసి విద్యార్థులు ప్రభుత్వ బడిల్లో చదివేలా చేశారు.ప్రస్తుతం 24 మంది విద్యార్థులున్నారు. పాఠాలను ఆటలు, బొమ్మల రూపంలో నేర్పిస్తూ విద్యార్థుల్లో ఆసక్తి కలిగిస్తున్నారు.ఆదివారం, సెలవురోజు అంటే విద్యార్థులకు ఆనందం. కానీ ఇక్కడ మాత్రం సెలవును బడిలోనే గడిపేందుదకు ఇష్టపడతారు.రమాభార్గవి స్కౌట్స్ అండ్ గైడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. 2023,24 లో ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు.

గరువులకు గుర్తింపు



ఎలిశెట్టి ధనుంజయ



పోలి సాయినాథ్ రెడ్డి

ఓబులవారిపల్లె: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుల అవార్డుకు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లి పంచాయతీ, సీఎం బలిజపల్లి గ్రామానికి చెందిన ఎలిశెట్టి ధనుంజయ,అదే మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన డాక్టర్ పోలి సాయినాథ్ రెడ్డి ఎంపికయ్యారు, ధనంజయ కడప జిల్లా వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణిత అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఈయన రాయలసీమ ప్రాంతం నుంచి సీనియర్ లెక్చరర్ విభాగంలో అవార్డు పొందారు. సాయినాథ్‌రెడ్డి నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఐఐటీ మద్రాసులో ఎంటెక్ చదివారు. జేఎన్‌టీయూ అనంతపురంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.వీరికి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



శునకాలు పట్టేస్తున్నాయ్..!

- బి.కొత్తకోటలో వెంటాడి కరుస్తున్న కుక్కలు
- ఒక్కరోజే 35 మంది ఆస్పత్రిపాలు
- నాలుగు రోజుల్లో 60 మందికి పైనే
- ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయం

బి.కొత్తకోట : స్థానిక నగర పంచాయతీ పరిధిలో గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులుగా పట్టణమంతా సంచరిస్తూ అలజడి సృష్టిస్తున్నాయి. ప్రతి రోజూ కనిపించిన వారినల్లా కరచి ఆస్పత్రి పాలు చేస్తున్నాయి. ఇలా ఒకరిద్దరిని కాదు ఏకంగా పదుల సంఖ్యలో బాధితులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. గురువారం ఒక్కరోజే 35 మందికి పైగా ఆస్పత్రిపాలయ్యారు. సాయంత్రం స్థానిక మీడియా ప్రతినిధి చిట్టా రామకృష్ణారెడ్డి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కల గుంపు దాడి చేసి కాలిపై కరిచాయి. అంతటితో ఆగని కుక్కలు వరుసగా కనిపించిన వారందరిపైనా దాడి చేస్తూ కరుస్తూ వెళ్లాయి. స్థానికులు, స్థానికేతరులైన 35 మంది వరకు బాధితులయ్యారు. వీరిలో చిట్టా రామకృష్ణారెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, డి.రమాదేవి, రెడ్డెమ్మ, కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి, వెంకటమ్మ, కృష్ణమూర్తి, నరసమ్మ, వెంకటస్వామి, విష్ణువర్ధన్, ఎర్రమ్మ, రమాదేవి,


ప్రభుత్వాసుపత్రికి వచ్చిన కుక్కకాటు బాధితులు

బయ్యన్న, భాగ్యశ్రీ, కిట్టన్న, పద్మావతి, ఎం.వెంకటమ్మ, కళావతి, షబీనా, రామ్మూర్తి, రయాన్, లింగమ్మలు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం చేయించుకోగా మిగిలిన వారు ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లినట్లు సమాచారం.

కాగా ఈనెల ఒకటిన కుక్క కాటుకు గురైన నరసమ్మ, వర్షిణీ, హబీబ్‌జాన్, రెడెమ్మలు, రెండో తేదిన హష్మీ, బిందు, రెడ్డెమ్మ, దర్శిత, అమీనాబీ, నీలమ్మ, మహ్మద్, ఆసీఫ్, అర్షిత, మూడో తేదీన శ్రీరజ్, గణేష్, జీవన్‌కుమార్, ప్రసాద్, వెంకటరమణ, నారాయణలు కుక్క కాట్లకు గురై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.


బి.కొత్తకోటలో కుక్కల గుంపు

వీరుకాక పదుల సంఖ్యలో బాధితులు ప్రయివేటు ఆస్పత్రులు, మదనపల్లెకు వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. బి.కొత్తకోట పట్టణంలో కుక్కల సంతతి జనంతో పోటీ పడుతున్నట్టు కనిపిస్తోంది. ఏ వీధిలో చూసినా, ప్రధాన రహదారులపైనా కుక్కలే కనిపిస్తాయి. అందులో గుంపులే అధికం. దీనితో వారికి ఎవరు ఎదురుపడినా దాడి చేస్తూ కరుస్తున్నాయి. ఈ వరుస ఘటనలపై కమిషనర్ జీవీ ప్రమీల మాట్లాడుతూ కుక్కలను అదుపు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భయం.. భయం

బి.కొత్తకోటలో జనం రోడ్లు, వీధుల్లోకి రావాలంటేనే భయకంపితులవుతున్నారు. ఏ క్షణంలో కుక్కలు దాడి చేస్తాయో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. స్కూళ్లకు వెళ్లే చిన్నారులు, నడిచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు తమ బిడ్డలపై కుక్కలు దాడి చేస్తాయన్న భయాందోళనతో ఉన్నారు. పిల్లలను వెంట తీసుకెళ్తున్నారు. అయినప్పటికీ స్కూళ్ల వెలుపలకు వస్తే కుక్కల బారిన పడ్తారేమో అన్న ఆందోళనతో ఉన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా కుక్కలు కాట్లు వేస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. వాటి నుంచి రక్షించాలంటూ ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

రాయచోటి టౌన్ : రాయచోటి డైట్ కేంద్రంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి సర్వేపల్లి చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి దేశానికి ఉపరాష్ట్రపతిగా ఎనలేని సేవలు అందించారని చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్, సీనియర్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. తట్టివారిపల్లె పంచాయతీ బీఎన్.రెడ్డి కాలనీకి చెందిన జయపాల్ భార్య దేవిక(64) స్థానికంగా ఓ ఇంట్లో పనులు చేసేందుకు రోడ్డుపై నడిచి వస్తుండగా, వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తరలించే ప్రయత్నం చేస్తుండగా మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సజీవ దహన యత్నంలో ఆరుగురిపై కేసు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని బీకే.పల్లె కాలనీలో బుధవారం తెల్లవారుజామున జరిగిన సజీవ దహన యత్నం ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. రాయచోటికి చెందిన కాలేషా, ఖాదర్‌వలీలు తమ అనుచరులతో కలిసి మహబూబ్‌బాషా ఇంటిపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. కింది పోర్షన్‌లోని షాపురూమ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టేందుకు ప్రయత్నించగా, షాపును అద్దెకు తీసుకుని జిరాక్స్ దుకాణం నిర్వహిస్తున్న రమేష్‌నాయక్ అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. అయినా కాలేషా, ఖాదర్‌వలీలు పెట్రోల్ పోసి అంటించి సజీవ దహనానికి యత్నించారు. ఈ ఘటనలో వారితోపాటు మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులపై.. దాడి, హత్యాయత్నం, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


మహమ్మద్ జైన్(ఫైల్)

మదనపల్లె రూరల్ : అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. రంగారెడ్డికాలనీ కొత్త ఇండ్లకు చెందిన అప్సద్‌బాషా, అయేషా దంపతుల కుమారుడు మహమ్మద్ జైన్(22) స్థానికంగా మటన్ మార్కెట్‌లో పని చేస్తుండే వాడు. ఆరునెలల క్రితం కామెర్ల వ్యాధి సోకగా, సరైన చికిత్సలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో పరిస్థితి విషమంగా మారింది. దీంతో చెన్నై, తిరుపతిలో చికిత్సలు చేయించారు. అయినా ఆరోగ్యపరిస్థితి మెరుగుపడకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి తాను నివసిస్తున్న ఇంటిపైన ఉన్న రూములో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు ఎంతసేపటికీ మిద్దెపై నుంచి కిందకు రాకపోవడంతో తల్లిదండ్రులు పైకి వెళ్లి చూశారు. మహమ్మద్‌జైన్ ఉరికి వేలాడుతూ కనిపించడంతో తలుపులు పగలగొట్టి కిందికి దించి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన శంకర

మదనపల్లె రూరల్ : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన రామయ్య కుమారుడు జి.శంకర(48) పక్కింటికి చెందిన గోపాల్(47)తో కలిసి మదనపల్లె బైపాస్‌రోడ్డులోని నిమ్మనపల్లె సర్కిల్ నాలుగురోడ్ల వద్ద మాట్లాడుకుంటుండగా, వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి వీరిని ఢీకొంది. ప్రమాదంలో శంకర తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరగా, గోపాల్ తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్సల అనంతరం శంకర పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరిగి మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శంకర ఎగువమాచిరెడ్డిగారిపల్లె టీడీపీ బూత్ ఇన్‌చార్జిగా పని చేస్తుండే వారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గది వద్ద శంకర మృతదేహాన్ని పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు.

ములకలచెరువు మార్కెట్‌కు వరదలా టమాట

ఊహించని విధంగా మదనపల్లెకు తగ్గిన వైనం

మదనపల్లె : టమాట విక్రయాలకు పేరొందిన మదనపల్లె మార్కెట్‌ను ములకలచెరువు మార్కెట్ మించిపోతోంది. దేశవ్యాప్తంగా వ్యాపారులు మదనపల్లె మార్కెట్‌పైనే అత్యధికంగా ఆధారపడుతారు. ఎందుకంటే ఇక్కడ ఉదయమే వేలంపాటలు మొదలై మధ్యాహ్నానికి ఎగుమతులు ప్రారంభమవుతాయి. అందరికి ఇదే సరైన సమయం. అయితే ములకలచెరువు మార్కెట్‌లో సాయంత్రం దాటాక వేలంపాటలు మొదలవుతాయి. అప్పుడు వ్యాపారులు వేలంలో పాల్గొని, టమాటను ఎగుమతి చేసుకుని ఉదయానికల్లా చేరాల్సిన మార్కెట్‌కు సరుకును చేర్చడం కష్టం. దీనితో ఉదయం మార్కెట్ మదనపల్లెకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అయితే గత నాలుగురోజులుగా ఈ రెండు మార్కెట్లకు వస్తున్న టమాట దిగుమతి షాక్‌కు గురి చేస్తోంది. ఈ నెల ఒకటి నుంచి ములకలచెరువు, మదనపల్లె మార్కెట్లకు వస్తున్న టమాటలో ఊహించని తేడా ఉంది. ములకలచెరువుకు వందల టన్నుల టమాట వ స్తుంటే.. మదనపల్లెకు వంద టన్నులు మించుతోంది. ములకలచెరువు మార్కెట్‌కు ఈ నెల ఒకటిన 792 టన్నులు, 2న 838 టన్నులు, 3న 780 టన్నుల టమాట విక్రయానికి వచ్చింది. మదనపల్లె మార్కెట్‌కు ఈనెల ఒకటిన 102 టన్నులు, 2న 115 టన్నులు, 3న 128 టన్నులు, 4న 134 టన్నుల టమాట మాత్రమే వచ్చింది. ధరల విషయానికి వస్తే ములకలచెరువు మార్కెట్‌లో ఒకటిన కిలో టమాట రూ.18 నుంచి 22 వరకు పలికింది. 2న రూ.18 నుంచి రూ.20, 3న రూ.15 నుంచి 19 వరకు పలికింది. మదనపల్లె మార్కెట్‌లో ఈనెల ఒకటిన కిలో టమాట రూ.23 నుంచి 29, 2న రూ.21 నుంచి 28, 3న రూ.20 నుంచి రూ.25, 4న రూ.18 నుంచి రూ.22 పలికింది. అయితే మదనపల్లె మార్కెట్‌కు భారీగా వచ్చే టమాట తగ్గడంపై అర్థం కాని పరిస్థితి నెలకొంది.

పకడ్బందీగా స్వామిత్వ సర్వే


స్వామిత్వ సర్వేను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

నిమ్మనపల్లె : ప్రజల నివాస ప్రాంతాలకు సంబంధించి తమ ఆస్తిపై పూర్తి హక్కు కల్పించేలా చేపట్టిన స్వామిత్వ సర్వే పకడ్బందీగా పూర్తి చేస్తున్నట్లు మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు తెలిపారు. గురువారం మండంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లె, బండ్లపై, ముష్టూరు, కొండయ్యగారిపల్లె తదితర గ్రామాల్లో సచివాలయ సిబ్బంది చేపట్టిన స్వామిత్వ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే నిర్వహణపై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామిత్వ స్కీమ్ గ్రామాల్లో మెరుగైన సాంకేతికతతో కూడిన సర్వే, మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసిన పథకమన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక సాధికారత, స్వీయ సాధికారతను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకంగా 2020 ఏప్రిల్ 24న స్వామిత్వ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారన్నారు. 2021 నుంచి 2025 వరకు దేశవ్యాప్తంగా 6.62 లక్షల గ్రామాలను ఈ పథకంలో సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఆస్తి డేటాను సేకరించేందుకు డ్రోన్‌లతో సహా వివిధ సాంకేతికతను ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈనెల పదో తేదీలోగా సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. 15వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అవసరమైన చర్యలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో గురువారం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో రెండవ మాసం కల్యాణం మఠం ఆస్థాన ప్రధాన అర్చకుడు ఇడమటికంటి జనార్ధనాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారి శిష్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి తన్మయులయ్యారు. ప్రతి నెల శుద్ధ ద్వాదశి నాడు దాతల సహకారంతో స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి, మఠం మేనేజర్ ఈశ్వరాచారి, పూజారులు, దాతలు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న మఠం నిర్వాహకులు

పది పరీక్షల నిర్వహణ బకాయిలు చెల్లించండి

రాయచోటి : పదో తరగతి పరీక్షలు నిర్వహించి తిరిగి స్పాట్ వ్యాల్యుయేషన్‌లో పాలుపంకున్న ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ పరీక్షల సంచాలకులు కేవీ శ్రీనివాసులురెడ్డిని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు. గురువారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో వారు కలిశారు. వినతిపై స్పందిస్తూ బకాయిలకు సంబంధించిన టోకెన్ నంబర్లను సమర్పిస్తే బకాయిలు విడుదల చేస్తామని చెప్పారని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఇదే విషయంపై అన్నమయ్య జిల్లా డీఈఓను అనేక సార్లు ఆదేశించినా టోకెన్ నంబర్లను పంపకపోవడంతో చెల్లింపుల్లో ఆలస్యం అవుతుందన్నారు. మూడు సంవత్సరాలకు సంబంధించిన బిల్లు బకాయిలు, ఈ విద్యా సంవత్సరంలో (రూ. 60 లక్షలు) స్పాట్ వాల్యుయేషన్ పూర్తయి నాలుగు నెలలు గడిచినప్పటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై డీఈఓ, జిల్లా కలెక్టర్, ఆర్‌జేడీ కార్యాలయాల ఎదుట వివిధ రూపాలలో నిరసనలు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు బకాయిలు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఇతర ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తామని ఏపీ పరీక్షల సంచాలకులకు తెలియపరిచినట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు.


ఏపీ పరీక్షల సంచాలకులు శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చైన్ స్నాచింగ్

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్లచెరువు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు 5తులాలు బంగారు నగలు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొయిళ్లచెరువుకు చెందిన లింగాల పార్వతి, కంబం రమాదేవి తమ వ్యక్తిగత పనుల మీద వీరపునాయునిపల్లెకు వచ్చి ముగించుకొని తిరుగు ప్రయాణంలో రామిరెడ్డిపల్లె నుంచి నడుచుకొంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో వారిని వెంబడించి కత్తులు చూపించి బెదిరించి వారి మెడలోని బంగారు నగలను లాక్కొని వెళ్లడం జరిగిందని ఏఎస్ఐ రామచంద్ర తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED GUNMEN
ప్రముఖ కంపెనీ ద్వారా
కడప లో
పనిచేయుటకు ఈ క్రింది అభ్యర్థులు కావలెను.
GUNMEN: ప్రభుత్వం వారిచే గన్ లైసెన్స్ కలిగి ఉన్న అభ్యర్థులు.
జీతం : 40,000/- + PF + ESI + INSURANCE
డ్యూటీ: 12 గం., వయస్సు: 50 సం.లోపు
GLADIATOR SECURITY
Santhinagar, Nr. NAD Jn. Vizag
7730825789

ఇరు వర్గాల ఘర్షణలో 10 మందిపై కేసు

కేవీపల్లె : ఇరు వర్గాల ఘర్షణలో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పింఛా బ్రిడ్జి వద్ద గత నెల 31న గణేష్ నిమజ్జనం సందర్భంగా పాళెంగడ్డకు చెందిన ఓ వర్గం, దేవాండ్లపల్లెకు చెందిన మరోవర్గం వారు ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసుకుని గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పాళెంగడ్డకు చెందిన రుద్రయ్య, హరి, శ్రీకాంత్, గుణశేఖర్, రాంబాబు, దామోదర్‌పై, దేవాండ్లపల్లెకు చెందిన గిరి, రవీంద్ర, అనిల్, ఆంజినేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే ఇదిలా ఉండగా తమపై ఎస్ఐతోపాటు పోలీస్ సిబ్బంది తీవ్రంగా కొట్టి గాయపరిచారని కొంత మంది గురువారం పీలేరు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. దీనిపై ఎస్ఐను వివరణ కోరగా తామెవ్వరని కొట్టలేదని, రెండు వర్గాలు ఘర్షణ పడగా తమ సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి శాంతియుత వాతావరణం నెలకొల్పినట్లు తెలిపారు.

ఆడుకుంటూ.. అనంతలోకాలకు..

- నీటి సంపులో పడి చిన్నారి మృతి
- జన్మదినం ముందు రోజే విషాదం


మృతి చెందిన చిన్నారి సానియా

మదనపల్లె రూరల్ : బుడిబుడి అడుగులతో ఆడుకుంటున్న ఓ చిన్నారి.. అనంతలోకాలకు వెళ్లింది. తెల్లవారితే కుటుంబ సభ్యుల మధ్య పుట్టినరోజు జరుపుకోవాల్సిన ఆ అమ్మాయి.. నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బాబు కాలనీకి చెందిన జమీర్, సిద్దిక దంపతుల కుమార్తె సానియా (2) సాయంత్రం కనిపించకుండా పోయింది. ఓవైపు వారానికి ఒకసారి వచ్చే మున్సిపాలిటీ నీళ్లు పట్టుకునే క్రమంలో, అందరూ హడావిడిగా ఉన్నారు. మరోవైపు సానియా ఆటలాడుకుంటూ తన ఇంటి పక్కనున్న మరో ఇంటిలోకి వెళ్లింది. ఆడుకుంటూ వారెవరూ గమనించని సమయంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయింది. కుమార్తె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతుకుతుండగా, పక్కింటి వారు నీటి సంపునకు మూత వేసేందుకు దగ్గరకు వచ్చి చూశారు. చిన్నారి సంపులో పడిపోయి ఉండటాన్ని గమనించి బయటకు తీశారు. అప్పటికే పాప మృతి చెందడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా సానియా శుక్రవారం జన్మదిన జరుపుకోవాల్సి ఉంది. తెల్లవారితే తమ బిడ్డ బర్త్ డే చేయాల్సిన తల్లిదండ్రులు, జీవం లేని చిన్నారిని ఎత్తుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదని తెలిసింది.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


చింతల రమణ మృతదేహం

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం రాత్రి చింతల రమణ (32) అనే వ్యక్తి ఇంటి లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. పల్లవోలుకు చెందిన చింతల రమణ నాలుగేళ్ల క్రితం మిడుతూరుకు చెందిన ప్రసన్న అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మనస్తాపం చెందిన రమణ ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రమణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీ శాఖాధికారులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం గువ్వలచెరువు తూర్పు భాగంలోని కొత్తిమడుగు అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు గురువారం 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ భరణికుమార్ మాట్లాడుతూ రాయచోటి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు కూంబింగ్ చేపట్టినట్లు తెలిపారు. ఎర్రచందనం దుంగలు మోసుకువెళ్తున్న కూలీలు తమను చూసి పరారయ్యారన్నారు. 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, వీటి బరువు సుమారు 370 కేజీలు, విలువ రూ.1.80 లక్షలు చేస్తాయని పేర్కొన్నారు. పారిపోయిన స్మగ్లర్ల జాడ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రెడ్డప్ప, కొత్తిమడుగు బీట్ ప్రొటెక్షన్ వాచర్స్ రమణ, గురవయ్య, రెడ్డయ్య, శ్రీనివాసులు, కొండయ్య, జయరామ, పెద్దరెడ్డయ్య, శీను, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలే

- యూరియా బస్తా కోసం తీవ్ర ఇక్కట్లు
- 9న జిల్లా కలెక్టరేట్ రైతుపోరును విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైందని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతుల సమస్యలపై ఈ నెల 9న అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. రైతుపోరు నిరసన కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతిగా వారికిచ్చిన మాట ప్రకారం ప్రతి పథకాన్ని అందజేసి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఏ సీజన్‌కు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ అదే సీజన్‌లో ఇస్తూ.. రైతులకు అండగా నిలిచామన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. మామిడి, టమాటా పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. చివరకు వరి పంటకు అవసరమైన యూరియాను రైతులకు అందించలేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గంటల తరబడి క్యూలో నిల్చుంటే కేవలం ఒక బస్తాను ఇవ్వడమే కాకుండా పంపిణీలో రాజకీయ వివక్ష కనపరుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఎరువును సకాలంలో అందించామన్నారు. మదనపల్లె నియోజకవర్గంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కనపరుస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీటీఎం వద్ద టమాటా ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారాలోకేష్ హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. హంద్రీ-నీవా కాలువలో కృష్ణాజలాలు మదనపల్లె మీదుగా కుప్పం వెళుతున్నాయే కానీ, మదనపల్లె నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేతవిభాగం జిల్లా అధ్యక్షులు శీలంరమేష్, రైతు నాయకులు జన్నే రాజేంద్రనాయుడు, చిప్పిలి జగన్నాథరెడ్డి, సీటీఎం-2 పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బండపల్లె వెంకటరమణ, గ్రానైట్ మహేష్, వేణుగోపాల్, మజ్జిగ కేశవ, రామమూర్తి, శివ, శంకరనాయక్, చలపతి, నాగార్జున, శ్రీరాములు, చిన్నికృష్ణ, విశ్వనాథ్, జహీర్, అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ADMISSION
■ ఇంటర్మీడియట్(One Sitting)MPC, BiPC, MBiPC, CEC గ్రూపు లందు అడ్మిషన్లు జరుగుచున్నవి. Exams: March-2026 (Last Chance).For Admissions. 8247457565.

REAL ESTATE
HOUSE FOR SALE
■ హౌసింగ్ బోర్డ్ అనంతపురం పవన్ గ్యాస్ ఎదురు వీధి, MIG 221 తూర్పు ముఖం. 40x62.5 కొలతలతో 5.75 సెంట్ల పాత ఇల్లు అమ్మబడును. సంప్ర: 94404 88444

SERVICES
బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్. 7382114847

PASSPORT MISSING
■ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెంబర్: K4167210 సలమూరు శివనాగరాజు, తండ్రి నాగయ్య, ఎల్లంపల్లి గ్రామం, మైదుకూరు, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్, దొరికినవారు తెలుపగలరు. సెల్: 7842758865

WANTED
■ ప్రముఖ అమెజాన్ ఫ్లిప్కార్ట్ వంటి MNC సంస్థలలో పనిచేయుటకు యువతీ/ యువకులు కావలెను. Qul: 10th-డిగ్రీ, జీతం: 15000/- ఆపైన. అర్హతను బట్టి మంచి ఆదాయం. 95918 20747

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంటను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 20K. Ph: 8977639662, 8977639663

■ జిల్లాలో బ్యాంకుల్లో వర్క్ చేయుటకు అటెండర్స్, క్లర్క్స్, రికవరీ, క్యాష్ లోడింగ్, కం.ఆపరేటర్స్, క్యాషియర్స్, అసిస్టెంట్స్, జీ : 27000/-, Q: 10-డిగ్రీ. 8297349403

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd. 7993583999

■ CDS PU NGO కడప నందు ప్రోగ్రాం మేనేజర్ గా పనిచేయుటకు అభ్యర్థి కావలెను. జీతం:21,000+TA 1400,విద్య అర్హత:MSW & Sociology అనక్తి గల అభ్యర్థులు 15.09.2025లోగా ఈ క్రింది Mail&Resume ను పంపగలరు. cdstingokadapa@gmail.com. Cell: 7095453034, 9440758103.

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

